

కొనసాగిన రద్దీ

దసరాకు సొంతూళ్లకు వచ్చిన ప్రజానీకం తిరుగు పయనం కావడంతో హైవేపై వాహనాల రద్దీ కొనసాగింది. - 8లో



ఆర్టీసీకి కలిసొచ్చిన దసరా

దసరా పండుగ ఆర్టీసీకి కలిసొచ్చింది. నల్లగొండ రీజియన్‌కు రూ.1,65,78,605 ఆదాయం సమకూరింది. - 8లో



వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పైళ్ల శేఖర్‌రెడ్డి కోరారు. - 9లో

న్యూస్‌రీల్

14 వరకు పరీక్ష ఫీజు గడువు

నల్లగొండ టూటౌన్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ మూడవ సెమిస్టర్, 5వ సెమిస్టర్ పరీక్షలకు ఈ నెల 14వ తేదీలోగా విద్యార్థులు ఫీజు చెల్లించాలని ఎంజీయూ సీఓఈ ఉపేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుంతో ఈ నెల 16వ తేదీ వరకు చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు ఉపాధ్యాయుడు బోధిస్తున్న తీరును పరిశీలిస్తున్న డీఈఓ

భువనగిరి: పద తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఈఓ సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా భువనగిరి మండలం కూనూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి ప్రత్యేక తరగతులను పర్యవేక్షించారు. తరగతి గదిలో కూర్చొని విద్యార్థులకు ఉపాధ్యాయుడు బోధిస్తున్న తీరును పరిశీలించారు.వెనుబడిన విద్యార్థులను ప్రత్యేక దృష్టి సారించాలని, హెచ్‌ఎంలు కూడా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

మహాశివుడికి సంప్రదాయ పూజలు



శివాలయంలో స్పటిక లింగానికి పూజలు చేసి హారతినిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరి కొండపై శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.శివుడికి ఇష్టమైన రోజు కావడంతో రుద్రాభిషేకం, బిల్వార్చన, అభిషేకం తదితర పూజలు చేశారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ప్రధానాలయంలోనూ నిత్యారాధనలు కొనసాగాయి. వేకుజామున సుప్రభాత సేవ, గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేక చేసి, తులసీదళాలతో అర్చించారు. అనంతరం ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణం,జోడు సేవోత్సవం నిర్వహించారు.

వేడుకగా అశ్వవాహన సేవ



అశ్వవాహనంపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతున్న శ్రీవేంకటేశ్వరస్వామి

భువనగిరి: పట్టణ పరిధిలోని స్వర్ణగిరి క్షేత్రంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం అశ్వవాహన సేవ వేడుకగా సాగింది. స్వామి, అమ్మవారిని సుందరంగా అలంకరించి అశ్వవాహనంపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని సేవను చూసి తరించారు.ఉదయం సుప్రభాతం, తోమాల సేవ, సహస్రనామార్చన, మూలమంత్ర హవనం, నిత్యకల్యాణం నిర్వహించి మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ మానేపల్లి రామారావు పాల్గొన్నారు.



జిల్లా పరిషత్ కార్యాలయంలో ఓటరు జాబితాలు



కలెక్టరేట్‌లో కరదీపికలు, బ్యాలెట్ పేపర్లు, ఇతర సామగ్రి

'స్థానిక' సమరానికి సామగ్రి సిద్ధం

భువనగిరిటౌన్: ఎన్నికలకు అవసరమైన సామగ్రి మండల కేంద్రాలకు చేరుతోంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్లు ఈ నెల 9నుంచి స్వీకరించనున్న నేపథ్యంలో ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా ఓటరు జాబితాలు, కరదీపికలు, బ్యాలెట్ పేపర్లు తదితర సామగ్రిని జిల్లా పరిషత్ కార్యాలయం, కలెక్టరేట్‌లో సిద్ధంగా ఉంచారు. ఇప్పటికే కొన్ని మండలాలకు చేరవేయగా.. మిగతా చోట్లకు నేడు (మంగళవారం) తరలించనున్నారు.

మద్యం టెండర్లకు 108 దరఖాస్తులు

భువనగిరి : మద్యం దుకాణాలకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతుంది. జిల్లాలో 82 మద్యం దుకాణాలకు గాను గత నెల 26 నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. సోమవారం సాయంత్రం వరకు మొత్తం 108 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు అత్యధికంగా సోమవారం 63 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 18వ తేదీ వరకు గడువు ఉందన్నారు.

ఆక్రమణలను తేల్చేలా..

ముమ్మరంగా నిషేధిత భూముల సర్వే

- వందలాది ఎకరాలు అన్యాక్రాంతం
- సర్వే నంబర్లు, వాస్తవ విస్తీర్ణానికి సరిపోలని లెక్కలు
- రెండు రోజుల్లో పూర్తికానున్న సర్వే
- అనంతరం ప్రభుత్వానికి నివేదిక

సాక్షి, యాదాద్రి: హైకోర్టు ఆదేశాలతో చేపట్టిన నిషేధిత భూముల సర్వేలో అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. వందలాది ఎకరాల భూములు అన్యాక్రాంతమైనట్లు తెలుస్తోంది. సర్వే నంబర్లలో ఉన్న భూమికి, వాస్తవ విస్తీర్ణానికి లెక్కలు సరిపోలడం లేదు. జిల్లాలోని 17 మండలాల పరిధిలో నిషేధిత భూముల లెక్కలు తీసే పనిలో రెవెన్యూ యంత్రాంగం నిమగ్నమైంది. రెండు, మూడు రోజుల్లో సర్వే పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేయనుంది.

లెక్కలు తీస్తున్న భూములు ఇవీ..

కలెక్టర్ హనుమంతరావు ఆదేశాలతో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి పర్యవేక్షణలో నిషేధిత భూముల లెక్కలు తీస్తున్నారు. ఇందులో ప్రభుత్వ పరిధిలోకి వచ్చే ఇనాం, వక్ఫ్, దేవాదాయ, సీలింగ్, ఫారెస్ట్ భూములు, ఏసీబీ, సీబీఐ, ఈడీ నయీమ్, సిట్, ఇన్‌కంటాక్స్, ట్రిబ్యునల్ కేసులు, రైల్వేలు, టెలికాం, ఇతర కేంద్ర ప్రభుత్వ ఆస్తులకు ఇచ్చిన భూములు, కాలువలు, నాలా అనుమతులు ఉన్న భూములు, రోడ్లు, భవనాలు ఇలా పలు రకాల ప్రభుత్వ భూములను సర్వే చేస్తున్నారు. వీటికి సంబంధించిన సర్వే నంబర్లు, విస్తీర్ణం ప్రకారం జాబితాలను సిద్ధం చేస్తున్నారు. వీటిలో కొన్నింటికీ జియోగ్రాఫికల్ సర్వే చేసి మ్యాపులు సిద్ధం చేస్తున్నారు. అయితే ఇప్పటికే పూర్తి కావాల్సిన సర్వే పలు రకాల కారణాలతో జాప్యం జరుగుతోంది. వీలైనంత త్వరగా సర్వే పూర్తి చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు అందాయి.



ఆలేరు మండలం కొలనుపాకలో ప్రభుత్వ భూమిని సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఎందుకు సర్వే చేస్తున్నారంటే..

రెవెన్యూ రికార్డుల్లో ఒక విధంగా రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ విభాగంలో మరోవిధంగా వివరాలు నమోదు అయ్యాయి. ప్రభుత్వ భూమి సర్వే నెంబర్‌లో ప్రైవేట్ వ్యక్తుల భూమి ఉంటే అదికూడా నిషేధిత జాబితాలో చేరింది. తమ పట్టా భూములను నిషేధిత జాబితానుంచి తొలగించాలని వేలాది ఫిర్యాదులు రెవెన్యూ సదస్సుల్లో వచ్చాయి. దీనిపై కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో ఉండటాన్ని కోర్టు తప్పు పట్టి సరిచేయాలని ఆదేశించింది. పూర్తి నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి అందజేయనున్నారు. తద్వారా సమస్యలను పరిష్కరించవచ్చు.

పట్టా భూములుగా రికార్డు

యంత్రాంగం ఉదాసీనత, అవినీతి పుణ్యమా అని ప్రభుత్వ భూములు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లాయి. జిల్లాలో వందల ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయి. సర్వే నంబర్లలో ఉన్న భూమికి, అసైన్డ్ భూముల వివరాలకు లెక్కలు సరిపోలడంలేదు. విస్తీర్ణానికి మించి పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్నాయి. పహాణీలకు విరుద్ధంగా ధరణి, భూ భారతి పోర్టల్ భూముల లెక్కలు ఇష్టారాజ్యంగా ఉన్నాయి. ప్రధానంగా భూముల స్వభావం, విస్తీర్ణం, సర్వే నంబర్లు, రైతుల పేర్లు ఉన్నాయి. అసైన్డ్ భూములు, సీలింగ్, దేవాదాయ, వక్ఫ్ భూములు పట్టా భూములుగా రికార్డు అయ్యాయి. పట్టాభూములు కొన్ని చోట్ల నిషేధిత జాబితాలో చేర్చారు. ఇలా తమ పట్టా భూములను నిషేధిత జాబితాలో చేర్చడానికి సవాల్ చేస్తూ పలువురు రైతులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో యంత్రాంగం సర్వే చేపట్టింది. ఒకటి రెండు రోజుల్లో సర్వే పూర్తి చేసి వివరాలను వెల్లడిస్తామని ఓ రెవెన్యూ అధికారి చెప్పారు.



హైదరాబాద్‌లోని హెచ్‌ఎండీఏ కార్యాలయం వద్ద రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితుల ధర్నాలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, చిత్రంలో ఎండీ జహంగీర్, నాయకులు

భూములు లాక్కుంటే ప్రతిఘటిస్తాం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

భువనగిరిటౌన్ : రీజినల్ రింగ్ రోడ్డు కోసం బలవంతంగా భూములను లాక్కుంటే ప్రతిఘటిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం హైదరాబాద్‌లోని హెచ్‌ఎండీఏ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాలో జిల్లా నుంచి పెద్ద ఎత్తున రైతులతో పాటు, రైతు సంఘాల ప్రతినిధులు, సీపీఎం జిల్లా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మాట్లాడారు. గ్రామసభలను నిర్వహించి రైతుల ఆమోదంతోనే భూములను సేకరించాలని డిమాండ్ చేశారు. రైతుల అనుమతి లేకుండా భూమిని తీసుకుంటే ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామని అన్నారు. ఇదే వైఖరి కొనసాగిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో రైతులంతా ఏకమై తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. 2013 చట్టంలోని షెడ్యూల్ 1లో చూపిన విధంగా మార్కెట్ రేటుకు నాలుగు రెట్లు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు, ఫార్మా సంస్థల యాజమానులు, ధనికులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసమే అలైన్‌మెంట్‌లో ప్రభుత్వం మార్పులు చేసిందని విమర్శించారు.

అశాస్త్రీయంగా అలైన్‌మెంట్ : జహంగీర్

రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ అశాస్త్రీయంగా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ జహంగీర్ అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, ఫార్మా సంస్థల అధినేతలు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల భూములు పోతున్నందుకే అలైన్‌మెంట్ మార్చారని విమర్శించారు. రైతుల ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు ఆ పదవిలో ఉండే నైతిక హక్కు లేదన్నారు. పదవులకు రాజీనామా చేస్తారా?, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పాత అలైన్‌మెంట్ అమలు చేస్తారా? తేల్చుకోవాలన్నారు. భూ నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదన్నారు. అనంతరం సీపీఎం నాయకులు అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డీజీ నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ శ్రీరాంనాయక్, బి.ప్రసాద్, కొండమడుగు నర్సింహ, ప్రజాసంఘాల నాయకులు కోట రమేష్, ఎం.శోభనానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ రాకపోకలు బంద్



పెద్దరావులపల్లి వద్ద వంతెనపై నుంచి పరవళ్లు తొక్కుతున్న మూసీ

భూదాన్‌పోచంపల్లి: జూలూరు - రుద్రవెల్లి మధ్యన ఉన్న వంతెన పైనుంచి రాకపోకలు మళ్లీ నిలిచిపోయాయి. హైదరాబాద్ ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో లో లెవల్ బ్రిడ్జిపై నుంచి మూసీ పరవళ్లు తొక్కుతోంది. దీంతో భూదాన్‌పోచంపల్లి మండలం నుంచి బీబీనగర్ ఎయిమ్స్‌కు వెళ్లే రోగులు, ఇటు భువనగిరికి రాకపోకలు సాగించే వాహనదారులు వయా పెద్దరావులపల్లి మీదుగా పోతున్నారు. ఈ మార్గంలో గౌస్‌కొండ, పెద్దరావులపల్లి రోడ్డంతా గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సీడీపీఓ కార్యాలయం తనిఖీ

భువనగిరిటౌన్: జిల్లా కేంద్రంలోని సీడీపీఓ, బాలరక్షాభవన్‌ను సోమవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు తనిఖీ చేశారు. సీడీపీఓ కార్యాలయంలో సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అక్టోబర్ నెలకు సంబంధించి హాజరు రిజిస్టర్‌లో పేర్లు నమోదు చేయకపోవడంతో పాటు, ఐదు రోజుల సంతకాలు సైతం లేకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు. సకాలంలో విధులకు హాజరు కావాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. చైల్డ్ లైన్‌కు వచ్చే ప్రతి కాల్‌కు స్పందించాలని సీడీపీఓను ఆదేశించారు. చైల్డ్‌లైన్ నిర్వహణ, ఉద్యోగుల గైరాజర్‌పై వచ్చిన ఫిర్యాదుల మేరకు కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట సీడీపీఓ శైలజ తదితరులు ఉన్నారు.

ఎన్నికల్లో పొరపాట్లకు తావుండరాదు

- కలెక్టర్ హనుమంతరావు

తుర్కపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. తుర్కపల్లి మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం ప్రిసైడింగ్ ఆఫీసర్ల(పీఓ) స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించి వారికి ఎన్నికల విధులు, బాధ్యతలు, నియమావళి తదితర అంశాలపై వివరించారు. ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ ఆఫీసర్ల పాత్ర కీలకమని, అన్ని విషయాలపై అవగాహన ఉన్నప్పుడే సక్రమంగా పోలింగ్ నిర్వహించగలరని సూచించారు. పోలింగ్ కేంద్రంలో ఏం జరిగినా పీఓలే బాధ్యత వహించాలని ఉంటుందని, అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జానయ్య, ఎంపీడీఓ లెంకల గీతారెడ్డి, తహసీల్దార్, దేశ్యానాయక్, ఎంపీఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పీఓల శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న కలెక్టర్

అలైన్‌మెంట్‌పై హామీ నిలబెట్టుకోవాలి

- రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్‌కి రీజినల్ భూ నిర్వాసితుల వినతి

చౌటుప్పల్ : రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితులు సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌ను కలిశారు. రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పుల మూలంగా తాము ఏవిధంగా నష్టపోతున్నామని వివరించారు.ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు మధ్య నిబంధనల ప్రకారం 48 కిలోమీటర్లు ఉండాలని, కానీ 28 కిలో మీటర్లు మాత్రమే ఉన్నదని తెలిపారు. బడా వ్యక్తులు, పారిశ్రామికవేత్తల కోసం అలైన్‌మెంట్ పలుమార్లు మార్చారని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే అలైన్‌మెంట్ మారుస్తామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ప్రియాంకగాంధీ భువనగిరి వచ్చినప్పుడు స్పష్టమైన హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఇప్పుడు సీఎం, మంత్రులు తమను కనీసం కలవడంలేదని, అపాయింట్‌మెంట్ కూడా ఇస్తలేని తెలిపారు. మీనాక్షి నటరాజన్ స్పందించారని.. సీఎంతో మాట్లాడుతానని, రాహుల్‌గాంధీ దృష్టికి సమస్య తీసుకెళ్లి భూర్వాసితులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారని రైతులు జాల వెంకటేశం, నాగవెళ్లి దశరథ తెలిపారు.



మీనాక్షి నటరాజన్‌కు సమస్యను వివరిస్తున్న రైతులు

మదర్ డెయిరీకి మరిన్ని కష్టాలు

యాదగిరి క్షేత్రానికి నార్మూల్ నెయ్యి బంద్

- గత నెల 23వ తేదీ నుంచి విజయ డెయిరీ నుంచి సరఫరా
- ఏటా రూ.18 కోట్ల ఆదాయం కోల్పోనున్న సంస్థ
- ఇప్పటికే భారీ నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న దుస్థితి

యాదగిరిగుట్ట: ఉమ్మడి నల్లగొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార యూనియన్ (నార్మూల్)కు ఇప్పటికే ఉన్న కష్టాలకు మరిన్ని ఇబ్బందులు తోడయ్యాయి. మదర్ డెయిరీకి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న యాదగిరిగుట్ట దేవస్థానానికి నెయ్యి సరఫరా నిలిచిపోవడంతో సంస్థకు మరింత నష్టం వాటిల్లనుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు విజయ డెయిరీతో యాదగిరి దేవస్థానం అధికారులు ఒప్పందం కుదుర్చుకొని, గత నెల 22వ తేదీ నుంచి నెయ్యిని కొనుగోలు చేస్తున్నారు.

పెద్ద మొత్తంలో కోల్పోనున్న ఆదాయం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని చెర్వుగట్టు, రాష్ట్రంలోని కీసర, వేములవాడ వంటి ఆలయాలకు గత కొన్నేళ్లుగా మదర్ డెయిరీ సంస్థ నెయ్యిని సరఫరా చేసింది. ప్రభుత్వ ఆదేశాలతో గతేడాది నుంచి చెర్వుగట్టు, కీసర, వేములవాడ ఆలయాలకు మదర్ డెయిరీ నెయ్యిని నిలిపివేసి, విజయ డెయిరీ నెయ్యి వాడుతుండటంతో సంస్థ కొంత మేర ఆదాయం కోల్పోయింది. ఇప్పుడు తెలంగాణలోనే పెద్ద పుణ్యక్షేత్రమైన యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సైతం మదర్ డెయిరీ నెయ్యిని నిలిపివేశారు. డెయిరీ నుంచి ఒక యాదగిరిగుట్ట క్షేత్రానికే ప్రతినెలా 30 టన్నుల నెయ్యి సరఫరా అయ్యేది. దీని ద్వారా ఏటా రూ.18 కోట్ల వరకు దేవస్థానం చెల్లిస్తుంది. ఇప్పుడు పెద్ద మొత్తంలో చెల్లింపులు నిలిచిపోనున్నాయి. ఇది సంస్థకు పెద్ద దెబ్బ అని పాడి రైతులు అంటున్నారు. చివరిసారిగా సెప్టెంబర్ 18వ తేదీన 46 క్యాన్ల నెయ్యి (ఒక్కో క్యాన్‌లో 35 కిలోలు) మదర్ డెయిరీ సరఫరా చేసింది. ఇందుకు గాను ఆలయం రూ.24.93 లక్షల బిల్లు చెల్లించి నార్మూల్‌తో ఒప్పందం రద్దు చేసుకుంది. ప్రభుత్వ నిర్ణయంతో నార్మూల్‌తో నారసింహుడికి క్షేత్రానికి 35 ఏళ్లుగా ఉన్న అనుబంధం తెగిపోయింది.



యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి లడ్డూ ప్రసాదం

యాదగిరి క్షేత్రానికి కొనసాగించాలని డిమాండ్

మదర్ డెయిరీ పరిధిలో 24 పాల శీతలీకరణ కేంద్రాలు ఉండగా.. 435 పాల సొసైటీల్లో 32వేల మంది వరకు సభ్యులు ఉన్నారు. సంస్థ ద్వారా ప్రతి రోజూ సుమారుగా 65వేల నుంచి 60వేలకు పైగా లీటర్ల పాల విక్రయాలు జరుగుతాయి. పాలతో పాటు అనుబంధం ఉత్పత్తులు తయారు చేసి విక్రయిస్తుంది. ఇందులో ప్రధానంగా నెయ్యిని యాదగిరి క్షేత్రంతో పాటు వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తుంది. కాగా ఆలయానికి మదర్ డెయిరీ సంస్థ నెయ్యినే కొనసాగించాలని సంస్థ అనుబంధ పాడి రైతులు, పాల సొసైటీ చైర్మన్లు, బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల యాదగిరిగుట్టలో దీక్ష కూడా చేశారు.

ప్రభుత్వ ఆదేశాలతోనే..

విజయ డెయిరీ నుంచి ఇప్పటికే రెండు ట్రిప్పుల నెయ్యి వచ్చింది. ఒక్కో ట్రిప్పులో 70 క్యాన్లు వచ్చాయి. క్కో క్యాన్‌లో 35 కిలోల వరకు నెయ్యి ఉంటుంది. మదర్ డెయిరీకి ఇచ్చిన విధంగానే విజయ డెయిరీకి జీఎస్టీతో కలుపుకొని లీటర్ నెయ్యికి రూ.609 చెల్లిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాలతోనే విజయ డెయిరీతో ఒప్పందం కుదుర్చుకొని, నెయ్యిని కొనుగోలు చేస్తున్నాం. -డి.నరేష్, యాదగిరి ఆలయ గోదాం పర్యవేక్షకుడు

నార్మూల్ ధరకే ఒప్పందం

ప్రభుత్వ ఆదేశాల మేరకు విజయ డెయిరీతో యాదగిరి దేవస్థానం అధికారులు ఒప్పందం కుదుర్చుకొని గత నెల 23వ తేదీ నుంచి నెయ్యి కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 142 క్యాన్ల నెయ్యి తీసుకున్నారు. అంతే కాకుండా శ్రీస్వామి వారి ఆలయంలో దీపానికి సైతం విజయ డెయిరీకి సంబంధించిన ఆవు నెయ్యిని కొనుగోలు చేస్తుంది. మదర్ డెయిరీ ధర ప్రకారమే విజయ డెయిరీ నుంచి సైతం నెయ్యిని అందజేసేందుకు అగ్రిమెంట్ కుదిరింది. మదర్ డెయిరీ కిలో నెయ్యి రూ.580, జీఎస్టీతో కలిపి రూ.609కి అందజేసింది. అదే రేటును జీఎస్టీతో కలుపుకొని విజయ డెయిరీ చెల్లిస్తుంది.



స్వామివారి పూజల్లో వాడేందుకు విజయ డెయిరీ నుంచి వచ్చిన ఆవు నెయ్యి ప్యాకెట్‌లు

ఆనందకరమైన జీవితం గడపాలి

- జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి, జడ్జి మాధవిలత

భువనగిరిటౌన్ : మత్తు పదార్థాలు, ఇతర చెడు వ్యసనాలను వీడి ఆహ్లాదకరమైన జీవనం ప్రారంభించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాధవిలత సూచించారు. భువనగిరిలోని సింగన్నగూడెంలో గల న్యూహోప్ అసోసియేషన్ డి అడిక్షన్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. మత్తు జోలికి వెళ్లకుండా స్వీయనియంత్రణ కలిగి ఉండాలని సూచించారు. మత్తుకు బానిసలవడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తడమే కాకుండా, కుటుంబాలు విచ్ఛిన్నమయ్యే అవకాశం ఉంటుందన్నారు. కాకుండా న్యాయ సేవ అధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహకారం పొందవచ్చని, జిల్లా కేంద్రంలో లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రతి శనివారం అందుబాటులో ఉంటుందని తెలిపారు. న్యాయపరమైన సలహాలకు టోల్ ఫ్రీ నంబర్ 15100ను సంప్రదించవచ్చన్నారు. మానసిక వైద్యులు డాక్టర్ ప్రీతిస్వరూప్ మాట్లాడుతూ చెడు వ్యసనాల వల్ల కలిగే మానసిక సమస్యలను అధిగమిం చేందుకు జిల్లా వైద్యారోగ్యశాఖ కృషి చేస్తుందన్నారు. కేంద్రంలో అందిస్తున్న చికిత్సల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేంద్రం డైరెక్టర్ కోమలి, డాక్టర్ శశాంక్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నారగోని రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి మాధవిలత

క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దండు మల్కాపురం గ్రామ స్టేజీకి ఎదురుగా ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంక్ దగ్గర సుమారు 43 సంవత్సరాల వయసు గల వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సోమవారం స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసు సిబ్బంది వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో మృతదేహం ఉంచారు. రోడ్డు వెంట తిరుగుతూ యాచకుడిగా ఉన్న వ్యక్తిలాగా అనుమానం ఉందని సీఐ మన్మథకుమార్ పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కుసుమ ఉపేందర్‌రెడ్డి తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నాగార్జునసాగర్: ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో జరిగింది. సాగర్ ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి హిల్‌కాలనీలోని జూనియర్ కళాశాల సమీపంలో తవనం వెంకట కృష్ణారెడ్డి (58)అవివాహితుడు, మతిస్థిమితం లేని వ్యక్తి తన ఇంటి ముందు వాకింగ్ చేస్తూ వెళుతున్నాడు. ఈ క్రమంలో ఇంటికి 50 అడుగుల దూరంలో షేక్ నాహీద్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా నడిపి కృష్ణారెడ్డిని ఢీకొట్టాడు. కృష్ణారెడ్డి తలకు గాయం కావడంతో స్థానిక కమలా నెహ్రూ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరి వేసుకుని బలవన్మరణం


యాకయ్య (ఫైల్)

మద్దిరాల : ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకుని వ్యక్తి మృతిచెందిన సంఘటన మద్దిరాల మండల పరిధిలోని రెడ్డిగూడెం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డిగూడెం గ్రామానికి చెందిన వల్లపు యాకయ్య(48) వృతిరీత్యా లారీ డ్రైవర్. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొన్ని రోజులుగా మద్యానికి బానిసై తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందాడు. మృతుడి భార్య రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ ఎం.వీరన్న తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

యువకుడు అదృశ్యం


భరత్

మాడుగులపల్లి : యాదగిరిగుట్టకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన మాడుగులపల్లి మండలంలోని కేశవాపురం గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కేశవాపురం గ్రామానికి చెందిన 26 సంవత్సరాల వయసు గల ఆరాల భరత్ గత నెల 29న యాదగిరిగుట్టకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. భరత్ తండ్రి భిక్షమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. భరత్ ఆచూకీ తెలిసిన వారు 8712670192, 9963742218 నంబర్లను సంప్రదించాలని అన్నారు.

బైక్ చోరీ

భువనగిరిటౌన్ : భువనగిరి పట్టణంలో సోమవారం ఉదయం 4 గంటల సమయంలో బైక్ చోరీ జరిగింది. వివరాలు.. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదురుగా ఉన్న తన ఇంటి వద్ద సలావుద్దీన్ తన బైక్‌ను పార్క్ చేశాడు. ఈ క్రమంలో బైక్‌ను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఘటన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలో ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగినట్లు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

ఆర్టీసీకి కలిసొచ్చిన దసరా

- బస్సుల్లో కిక్కిరిసిన ప్రయాణికులు
- అదనపు ఆదాయం రూ.1.65 కోట్లు
- ప్రథమ స్థానంలో సూర్యాపేట డిపో


ప్రయాణికులతో కిటకిటలాడుతున్న మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్

మిర్యాలగూడ టౌన్ : దసరా పండుగ వేళ ఆర్టీసీకి ఆదాయం కలిసొచ్చింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల కోసం వారం రోజులపాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నల్లగొండ, నార్కట్‌పల్లి, యాదగిరిగుట్ట, సూర్యాపేట, కోదాడ, దేవరకొండ, మిర్యాలగూడ డిపోల ద్వారా ఆర్టీసీ అధికారులు మొత్తం 597 అదనపు బస్సులను నడిపించారు. నల్లగొండ రీజియన్ పరిధిలోని ఏడు డిపోలలో పండుగకు ముందు.. పండుగ తరువాత మొత్తం 33,99,804 కిలోమీటర్ల మేర బస్సులను తిప్పగా రూ.1,65,78,605 వరకు ఆర్టీసీకి అదనపు ఆదాయం వచ్చింది.

తిరుగు ప్రయాణంలో కిక్కిరిసిన బస్సులు

దసరా పండుగ ముగియడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రయాణికులు పట్టణాల బాట పట్టడంతో అన్ని డిపోల్లోని ఆర్టీసీ బస్సులు కిక్కిరిసిపోయాయి. దసరా పండుగ మరుసటి రోజు నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సులు ప్రతిరోజు ప్రయాణికులతో నిండిపోయాయి. అదేవిధంగా పండుగకు ముందు మూడు రోజులపాటు.. పండుగ తరువాత నాలుగు రోజులపాటు రద్దీగా ఉన్నాయి. ఆయా డిపోల పరిధిలోని డీఎంలు, అసిస్టెంట్ డీఎంల పర్యవేక్షణలో ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా బస్సులను నడిపించారు.

పండుగ ముందు.. ఆ తర్వాత..

దసరా పండుగకు నల్లగొండ రీజియన్ పరిధిలోని ఏడు డిపోల నుంచి వివిధ ప్రాంతాలకు అదనపు బస్సులను నడిపించగా.. రీజియన్‌కు రూ.కోటి 65లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఆదాయంలో సూర్యాపేట డిపో ప్రథమ స్థానంలో ఉండగా.. యాదగిరిగుట్ట డిపో రెండో స్థానం, మూడో స్థానంలో మిర్యాలగూడ డిపో నిలిచింది. దసరా పండుగకు ముందు మూడు రోజులు, తరువాత మూడు రోజుల్లో రీజియన్ పరిధిలోని ఏడు డిపోల నుంచి ప్రత్యేక బస్సుల ద్వారా రూ.కోటి 65 లక్షల వరకు అదనపు ఆదాయం వచ్చింది.

డిపోలు	అదనపు బస్సులు	అదనపు ఆదాయం (రూ.లలో)
దేవరకొండ	60	14,95,942
నల్లగొండ	65	9,63,574
నార్కట్‌పల్లి	48	15,48,815
మిర్యాలగూడ	69	23,19,230
యాదగిరిగుట్ట	133	33,78,701
కోదాడ	92	21,55,178
సూర్యాపేట	130	47,17,165

597 అదనపు బస్సులు నడిపించాం



నల్లగొండ రీజియన్ పరిధిలో ఏడు డిపోల నుంచి 597 అదనపు బస్సులను నడిపించాం. ప్రయాణికుల రద్దీని బట్టి ఉద్యోగులు, కార్మికులు పనిచేశారు. ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేశారు. అందరి కృషి వల్లనే రీజియన్‌కు రూ.కోటి 65లక్షల 78 వేల వరకు అదనపు ఆదాయం వచ్చింది.

– కొణతం జానిరెడ్డి, ఆర్‌ఎం నల్లగొండ

‘సీఎంఆర్‌ఎఫ్’ నిందితుల అరెస్ట్

- నకిలీ వ్యక్తుల అకౌంట్‌లలోకి రూ. 9.50 లక్షలు జమ
- 8 మంది నిందితుల అరెస్ట్
- రూ.7.30 లక్షల నగదు, 44 చెక్కులు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కె.నరసింహ

సూర్యాపేటటౌన్ : ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్)కు సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు చేరకుండా అక్రమాలకు పాల్పడిన ఎనిమిది మంది నిందితులను సూర్యాపేట జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. మేళ్లచెర్వు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఈ కేసు వివరాలను సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కె.నరసింహ వెల్లడించారు. హుజూర్‌నగర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేసిన పెండెం వెంకటేశ్వర్లు, ప్రైవేట్ పీఏగా పనిచేసిన పులిందిండి ఓంకార్.. 2023 సంవత్సరం కంటే ముందు మంజూరైన మొత్తం రూ.34,58,400 విలువ గల 51 చెక్కులు అసలైన లబ్ధిదారులకు అందించకుండా లబ్ధిదారుల పేర్లకు దగ్గరగా ఉన్న వ్యక్తులను గుర్తించి అక్రమాలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులపై మంజూరైన మొత్తాన్ని కాజేయాలనే దురుద్దేశంతో, చెక్కులపై ఉన్న అసలు లబ్ధిదారుల పేర్లకు దగ్గరగా ఉన్న ఇతరులను వీరు ఎంచుకున్నారు. బెల్లంకొండ వెంకటేశ్వర్లు సహకారంతో నకిలీ లబ్ధిదారుల అకౌంట్లలో ఈ చెక్కులను జమ చేయించి, డబ్బులు డ్రా చేశారు. నకిలీ వ్యక్తులకు కొంత కమీషన్ ఇచ్చి మిగిలిన మొత్తాన్ని పంచుకున్నారు. అయితే మేళ్లచెర్వుకు చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి పక్షవాతం రావడంతో 2023లో సీఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోగా.. చెక్కు వచ్చినప్పటికీ రాలేదని పక్కదారి పట్టించారు. ఇటీవల తన పేరు మీద వచ్చిన చెక్కును మరొకరు డ్రా చేసుకున్నట్లు తెలియడంతో మేళ్లచెర్వు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఈ నేరం మాజీ ఎమ్మెల్యేకు తెలియకుండా క్యాంప్ కార్యాలయంలోని ప్రైవేట్ వ్యక్తులు తమ స్వలాభం కోసం పాల్పడినట్లు ఎస్పీ స్పష్టం చేశారు. నిందితుల నుంచి పోలీసులు రూ.7.30లక్షల నగదు, 44 వాడని చెక్కులు, 6 సెల్ ఫోన్లు, 6 బ్యాంక్ పాస్ పుస్తకాలు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ.34,58,400 విలువ గల 51 చెక్కులు ఆధీనంలో పెట్టుకుని వీటిలో రూ.9.50లక్షల విలువగల 7 చెక్కులు దుర్వినియోగం చేసినట్లు పోలీసులు గుర్తించారు . దుర్వినియోగానికి గురైన రూ. 9.50 లక్షలలో బాధితుడికి రూ.2 లక్షల 25వేలు ఇచ్చాక మిగిలిన రూ.7,30లక్షల నగదును నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితులు పెండెం వెంకటేశ్వర్లు, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే పీఏ పులిందిండి ఓంకార్‌తోపాటు నకిలీ లబ్ధిదారులు మాదాసు వెంకటేశ్వర్లు, మట్టపల్లి సైదులు, గొట్టుముక్కల వెంకటేశ్వర్లు, బెల్లంకొండ సైదులు, బెల్లంకొండ పద్మలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు.

జాతీయ రహదారిపై కొనసాగిన రద్దీ


చౌటుప్పల్ పట్టణంలో బారులుదీరిన వాహనాలు

చౌటుప్పల్ : జాతీయ రహదారిపై వాహనాల రద్దీ సోమవారం సైతం కొనసాగింది. దసరా పండుగ నిమిత్తం సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు సెలవులు ముగియడంతో తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో 65వ నంబర్ హైవేపై హైదరాబాద్ మార్గంలో కిలోమీటర్ల మేర వాహనాలు స్తంభించాయి. సాధారణ రోజుల్లో సుమారుగా 35 వేల నుంచి 40వేల వరకు వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా, సోమవారం అదనంగా మరో 20 వేల వాహనాలు రాకపోకలు సాగించినట్లు అంచనా. చౌటుప్పల్ పట్టణంలో నెలకొన్న రద్దీని నియంత్రించేందుకు జంక్షన్‌లను మూసివేశారు. బస్టాండ్‌లోకి ఆర్టీసీ బస్సులను సైతం అనుమతించలేదు. ప్రత్యేక పోలీసులను రంగంలోకి దింపారు. సాయంత్రం వరకు బారులుదీరిన వాహనాలు.. ఆ తర్వాత తగ్గాయి. హైవేపై రద్దీ కారణంగా కొంతమంది వాహనదారులు సర్వీస్‌రోడ్ల మీదుగా మళ్లించడంతో అవిసైతం ట్రాఫిక్ వలయంలో చిక్కుకున్నాయి.

పంతంగి టోల్‌ప్లాజా వద్ద ..

చౌటుప్పల్ రూరల్: దసరా పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లి తిరిగి హైదరాబాద్‌కు ప్రజలు వస్తుండంతో జాతీయ రహదారిపై భారీగా వాహనాల రద్దీ కొనసాగింది. సుమారు 6 కిమీల వరకు పంతంగి టోల్‌ప్లాజా నుంచి చౌటుప్పల్ వరకు భారీగా వాహనాలు బారులుదీరాయి. ఈ క్రమంలో నల్లగొండ నుంచి హైదరాబాద్‌కు ఆస్పత్రికి వెళ్తున్న ఓ అంబులెన్స్ ట్రాఫిక్‌లో చిక్కుకుంది. అంకిరెడ్డిగూడెం నుంచి చౌటుప్పల్ వరకు వాహనాలు సైడ్ ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో అంబులెన్స్ కూడా నెమ్మదిగా ముందుకు సాగింది. పంతంగి టోల్‌ప్లాజా వద్ద హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను 10 విండోలు ఓపెన్ చేసి పంపించారు. ఫాస్టాగ్ పని చేయని వాహనాలకు ఫొటో తీసుకుని పంపించారు.


పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

చిట్యాల వద్ద హైవేపై..

చిట్యాల: విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ నగరం వైపునకు చిట్యాల పట్టణంలో హైవే మీదుగా వాహనాల రద్దీ సోమవారం రాత్రి వరకు కొనసాగింది. చిట్యాల పట్టణంతోపాటు పెద్దకాపర్తి గ్రామ పరిధిలో హైవేపై ఫ్లైవర్ బ్రిడ్జి నిర్మాణాలు చేపడుతున్న కారణంగా సర్వీస్ రోడ్డు మీదుగా వాహనాలు నెమ్మదిగా వెళ్లాయి. చిట్యాల పట్టణ ప్రజలు హైవే రోడ్డును దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

మానసిక వ్యాధితో యువకుడు ఆత్మహత్య

వలిగొండ : మానసిక వ్యాధితో బాధపడుతూ గడ్డి మందుతాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వలిగొండ మండలంలోని ముద్దాపురం పరిధిలో చోటుచేసుకుంది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూరెడ్డి అనిల్‌రెడ్డి (23) అనే యువకుడు తన చిన్నతనంలో తల్లిదండ్రులను కోల్పోయి ఆత్మకూర్ ఎం మండలంలోని మేనమామ ఇంటి వద్ద ఉంటున్నాడు. పక్కనే ముద్దాపురం శివారులో ఉన్న ఎరువుల దుకాణంలో పనిచేస్తూ కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం తాను పనిచేస్తున్న ఎరువుల దుకాణంలో గడ్డి మందు తెచ్చుకుని తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

భార్యతో గొడవపడి..


భద్రి (ఫైల్)

అర్వపల్లి: భార్యతో గొడవపడి సంచారజాతికి చెందిన ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ సంఘటన జాజిరెడ్డిగూడెం మండలం సీతారాంపురం సమీపంలోని గుట్టపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా బేతంచర్ల మండలం కోటపేట గ్రామానికి చెందిన పూసల భద్రి(45) కొద్దిరోజులుగా తిరుమలగిరిలో ఉంటూ గ్రామాలు తిరిగి దిష్టిబొమ్మలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తన బైక్‌పై సీతారాంపురం సమీపంలోని గుట్టపైకి వెళ్లి లుంగీతో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. చుట్టుపక్కల రైతులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఈట సైదులు తెలిపారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ సిబ్బంది


నగదు ఉన్న బ్యాగును అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

నకిరేకల్ : ఆర్టీసీ సిబ్బంది తమ నిజాయితీ చాటుకున్నారు. బస్సులో ప్రయాణికులు పోగొట్టుకున్న లక్ష రూపాయల నగదు ఉన్న బ్యాగును తిరిగి ప్రయాణికులకు అప్పగించారు. వివరాలు.. కోదాడ ప్రాంతం నుంచి ఇద్దరు మహిళా ప్రయాణికులు నకిరేకల్‌కు వస్తున్నారు. సూర్యాపేట వరకు వచ్చాక సూర్యాపేట ఆర్టీసీ బస్టాండ్‌లో నల్లగొండకు వెళుతున్న టీఎస్ 4064 నంబర్ గల బస్సును సోమవారం మధ్యాహ్నం ఎక్కారు. ఈ క్రమంలో తమ సీటులో లక్ష రూపాయలు నగదు ఉన్న బ్యాగ్, మరో చేయి సంచిని సీటులో పెట్టి అత్యవసరంగా బస్సు దిగారు. అనంతరం ఆ ఇద్దరు ప్రయాణికులు తిరిగి బస్ కోసం రాగా అప్పటికే వెళ్లిపోయింది. సదరు ప్రయాణికులు అక్కడే బస్టాండ్‌లో ఉన్న కంట్రోలర్‌కు సమాచారం అందజేశారు. ఆయన ఫోన్ ద్వారా నకిరేకల్‌లో ఉన్న ఆర్టీసీ కంట్రోలర్ మన్నాన్‌కు సమాచారం అందించారు. నకిరేకల్ కంట్రోలర్ మన్నాన్.. కండక్టర్ నకిరేకల్ వాసి నోముల సత్తయ్యకు ఫోన్ చేసి ప్రయాణికులు బస్సు సీటులో ఉంచిన బ్యాగ్‌ను భద్రపరచమని సమాచారం అందించారు. బ్యాగ్ మిస్ అయిన ప్రయాణికులు కూడా నకిరేకల్‌లో ఉంటున్న వారి బంధువులకు సమాచారం అందించారు. కండక్టర్ సత్తయ్య బ్యాగ్‌ను భద్రపరిచి పోగొట్టుకున్న వారి బంధువులకు నకిరేకల్‌లో అప్పగించారు. బ్యాగ్ మిస్ అయినవారు నకిరేకల్‌కు మరో బస్‌లో వచ్చి తీసుకున్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ


బీరువా వద్ద చిందరవందరగా ఉన్న వస్తువులు

సంస్థాన్ నారాయణపురం: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన సోమవారం సంస్థాన్ నారాయణపురం మండలం జనగాం గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు అందోజు బీష్మా(రాజుచారి) తెలిపిన వివరాల ప్రకారం .. పుట్టపాక గ్రామంలోని బంధువులు ఇంట్లో శుభకార్యం ఉండడంతో బీష్మా(రాజుచారి) కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం సాయంత్రం వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో రాత్రి సమయంలో దుండగులు గేట్ తాళం పగులగొట్టడానికి ప్రయత్నం చేసినప్పటికీ తాళం రాలేదు. దీంతో ఇంటి పక్కన సందులో నుంచి గోడ దూకి ఇంట్లోకి ప్రవేశించారు. ఇంటి ప్రధాన ద్వారం తాళం తొలగించి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా తాళం పగులగొట్టకుండా స్క్రూలు తొలగించారు. బీరువాలోని 12 తులాలు బంగారు వస్తువులు (చైన్‌లు, రింగ్‌లు, ఇతర వస్తువులు), అరకేజీ వెండి వస్తువులు, రూ.1.50 లక్షల నగదు చోరీ చేశారు. బీరువాలోని వస్తువులను చిందరవందరగా పడవేశారు. సోమవారం బీష్మా ఇంటికి వచ్చేసరికి గేట్ తాళం వంగి ఉండడం, ప్రధాన ఇంటి ద్వారం తాళం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, చౌటుప్పల్ రూరల్ సీఐ రాములు, ఎస్ఐ జగన్ పరిశీలించారు. క్లూస్ టీం క్లూస్‌తో వివరాలు సేకరించినారు. గ్రామంలో సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు.

పలు దుకాణాల్లో దొంగతనం

చౌటుప్పల్ : జాతీయ రహదారి వెంట చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో పలు దుకాణాల్లో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద ఉన్న హైమావతి పూజా స్టోర్స్, అపోలో ఫార్మసీ, మహదేవ్ డ్రై ఫ్రూట్స్, అలివేలు ఫ్లవర్ డెకరేషన్స్ దుకాణాల నిర్వాహకులు వ్యాపారం ముగించుకుని రాత్రి షట్టర్‌లకు తాళాలు వేసి వెళ్లిపోయారు. చివరగా అపోలో ఫార్మసీ నిర్వాహకురాలు బత్తుల జ్యోతి రాత్రి 11.30 గంటలకు తాళం వేసి వెళ్లిపోయింది. సోమవారం ఉదయం ఏడు గంటలకు నీల సాయి అనే అపోలో ఫార్మసీ తెరిచి లోనికి వెళ్లగా సామగ్రి చిందరవందరగా పడి ఉన్నాయి. అనుమానంతో పరిశీలించగా కౌంటర్‌లోని రూ.35,500 నగదు, సీసీ కెమెరాల డీవీఆర్ బాక్స్ కనిపించలేదు. దీంతో దొంగతనం జరిగిందని గ్రహించాడు. వెంటనే బయటకు వచ్చి విషయం చెబుతుండగానే పక్కన ఉన్న దుకాణదారులు సైతం దొంగతనం జరిగిందని గుర్తించారు. హైమావతి పూజా స్టోర్స్‌లో రూ.5వేల నగదు, సీసీ కెమెరాల డీవీఆర్ బాక్స్, మహదేవ్ డ్రై ఫ్రూట్స్‌లో కొంత నగదు, సీసీ కెమెరాల డీవీఆర్ బాక్స్, అలివేలు ఫ్లవర్ డెకరేషన్ దుకాణంలో రూ.4900, సీసీ కెమెరాల డీవీఆర్ బాక్స్‌లు ఎత్తుకెళ్లారు. కాగా ఆయా దుకాణాల్లోకి వెనుక వైపు ఉన్న డోర్లను పగులగొట్టి దుండగులు లోనికి ప్రవేశించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాని సీఐ మన్మథకుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం


మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

దేవరకొండ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సోమవారం దేవరకొండ మండలం కొండభీమనపల్లి వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూలు జిల్లా వంగూరు మండలం చారగొండకు చెందిన కొర్ర శివ(29) ద్విచక్ర వాహనంపై మరో మహిళతో కలిసి దేవరకొండ వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో కొండభీమనపల్లి వద్దకు రాగానే దేవరకొండ నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న శివ, మహిళ కిందపడడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి వివరాలు సేకరించారు. మృతదేహాలను దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

ఇల్లు అద్దెకు తీసుకుని వ్యభిచారం

నల్లగొండ: టాస్క్‌ఫోర్స్ పోలీసుల సమాచారం మేరకు వ్యభిచార గృహంపై నల్లగొండ వన్ టౌన్ పోలీసులు దాడులు నిర్వహించి ఇద్దరు విటులు, ఇంటిని అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తున్న వ్యక్తి, ముగ్గురు మహిళలను అరెస్టు చేశారు. వివరాలు.. సోమవారం నల్లగొండ పట్టణంలోని ప్రియదర్శిని కాలనీలో ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తుండగా పోలీసులు దాడి చేశారు. కొన్ని నెలలుగా ఆ ఇల్లు అద్దెకు తీసుకొని గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

నిజాయితీకి నిలువుటద్దం జీఎస్‌రెడ్డి

- నాటితరం నేత.. నేటి తరానికి స్ఫూర్తి ప్రదాత
- ఉమ్మడి జిల్లా తొలి జెడ్పీ చైర్మన్ జీఎస్‌రెడ్డి


గోపు శౌరిరెడ్డి (జీఎస్‌రెడ్డి)


హుజూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన జీ.ఎస్.రెడ్డి విగ్రహం

కోదాడ: నిజాయితీకి నిలువుటద్దం.. నేటి తరానికి స్ఫూర్తి ప్రదాత.. తన ఆస్తిని సైతం ఫణంగా పెట్టి ప్రజలకు ఖర్చుచేసిన గొప్ప వ్యక్తి ఉమ్మడి నల్లగొండ జిల్లా తొలి జెడ్పీ చైర్మన్ గోపు శౌరిరెడ్డి (జీఎస్‌రెడ్డి). మంగళవారం జీఎస్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం. ‘పల్లె సీమల ప్రగతికి నా వంతు కృషి చేయాలన్నదే నా సంకల్పం. గాంధీజీ ఆశించిన గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నా.. అవసరమైతే నా ఆస్తులను ఖర్చుచేస్తా.. నా కుటుంబ సభ్యులెవరూ నా సంపాదన మీద ఆధారపడకూడదన్నదే నా అభిమతం’. 1952వ సంవత్సరంలో హైకోర్టు న్యాయవాదిగా పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న సందర్భంగా గోపు శౌరిరెడ్డి(జీఎస్‌రెడ్డి) తన సన్నిహితులతో అన్న మాటలవి. అన్న మాటలకు కట్టుబడి నిజాయితీకి నిలువుటద్దంగా నిలిచి సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉన్నా.. తన కున్న 60 ఎకరాల భూమిని రాజకీయాల్లో పోగొట్టుకుని తన నలుగురు కుమారులు వేరుపడున్న సమయంలో ఒక్కొక్కరికి రూ.40 వేల అప్పు పంచిన నేత ఆయన.

జిల్లా పరిషత్ తొలి చైర్మన్‌గా..

ఉమ్మడి నల్లగొండ మొదటి జిల్లా పరిషత్ చైర్మన్‌గా, మూడు విడతలు మిర్యాలగూడ పార్లమెంట్ సభ్యుడిగా జీఎస్‌రెడ్డి సేవలందించారు. మఠంపల్లి గ్రామానికి చెందిన గోపు శౌరిరెడ్డి 1917లో జన్మించారు. ఆయనను జీఎస్.రెడ్డి అంటేనే గుర్తిస్తారు. ఆయన అసలు పేరు నూటికి 90 మందికి తెలియదంటే ఆశ్చర్యపోక తప్పదు. న్యాయశాస్త్ర పట్టభద్రుడైన జీఎస్.రెడ్డి 1941–46 మధ్య కాలంలో సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఆ తరువాత 1947–50 వరకు హైకోర్టు న్యాయవాదిగా పనిచేశారు. 1952లో హుజూర్‌నగర్ అసెంబ్లీకి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేసి ఓడిపోయారు. 1962లో ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎన్నికైన ఆయన.. 1965 వరకు పదవిలో కొనసాగారు. ఈ సమయంలోనే కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల్లో అనేక గ్రామాలకు రహదారులు వేయించారు. మఠంపల్లి మండలం యాతవాకిళ్లలో 5 వేల ఎకరాలకు సాగునీరు అందించే వేములూరి ప్రాజెక్టును నిర్మించారు. ప్రస్తుత నల్లగొండ జెడ్పీ భవన స్థలం, హుజూర్‌నగర్‌లో పంచాయతీ స్థలాలు ఆయన హయంలో సేకరించినవే. జిల్లాలో 80కి పైగా హైస్కూళ్ల ఏర్పాటు చేశారు.

మూడు విడతలు ఎంపీగా..

జెడ్పీ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆయన పనితీరును గుర్తించి తొలిసారి మిర్యాలగూడ ఎంపీ స్థానం నుంచి పార్లమెంట్‌కు పోటీకి నిలిపింది. తొలిసారి 1967–71 వరకు, రెండోసారి 1971–75 వరకు, మూడోసారి 1980–84వరకు ఆయన ఎంపీగా సేవలందించారు. క్యాథలిక్ సొసైటీ జాతీయ అధ్యక్షుడిగా పనిచేసిన జీఎస్.రెడ్డి.. 1965వ సంవత్సరంలో మదర్ థెరిస్సాను నల్లగొండకు రప్పించి అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా చేశారు.

దేశానికి జీఎస్‌రెడ్డి లాంటి నేతలు కావాలి



నీతికి, నిజాయితీకి మారు పేరుగా నిలిచిన జీఎస్.రెడ్డి లాంటి నేతలు ప్రస్తుత సమాజానికి ఎంతో అవసరం. 30 సంవత్సరాలు రాజకీయాల్లో ఎన్నో పదవులను అలంకరించిన జీఎస్.రెడ్డి.. నాయా పైసా అక్రమ సంపాదనకు పాల్పడ లేదు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎన్నో పాఠశాలలను ఏర్పాటు చేశారు. నేటి యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలి.

– ఆసోదు సోమయ్య, జీఎస్‌రెడ్డి ప్రధాన అనుచరుడు

నేడు జీఎస్‌రెడ్డి వర్ధంతి

జీఎస్‌రెడ్డి వర్ధంతిని మంగళవారం నిర్వహించనున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల్లో అనేక అభివృద్ధి, సేవా కార్యక్రమాలు చేపట్టిన జీఎస్‌రెడ్డి.. 1986 అక్టోబర్ 7వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళుతుండగా సూర్యాపేట వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో ఆయనతోపాటు పెద్ద కుమారుడు రాయపురెడ్డి, మనవడు అభినయ్‌రెడ్డి మృతి చెందారు. ఆయనకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. రెండో కుమారుడు, రాజారెడ్డి, మూడో కుమారుడు ప్రతాపరెడ్డి ఐదు సంవత్సరాల క్రితం మృతి చెందారు. ప్రస్తుతం ఇద్దరు కుమార్తెలు, చిన్న కుమారుడు బాలిరెడ్డి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. జీఎస్‌రెడ్డి సేవలకు గుర్తుగా హుజూర్‌నగర్ ప్రధాన రహదారిపై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.